# షేర్ - ఇ - మాలీస్

కొన్నాళ్ళకిందట విశ్వరూపం పత్రిక ప్రకటించిన ఒక వార్తవిషయంలో ఒక చిన్న పేచీవచ్చింది. ఒక వూళ్ళో కొందరు ఘరానా ఆసాములు రాజకీయ బాధితులన్న పేరు పెట్టుకుని, యుద్ధంరోజుల నించీ హరిజనులు సాగుచేసుకుంటున్న భూములను గదుముకున్నారని మా విలేఖరి పంపిన వార్తను ప్రకటించాము. అది అబద్ధమనీ, దానిన్ని ఉపసంహరించకపోతే ఏమేమిటో చేస్తామనీ బెదిరిస్తూ కొందరు ఉత్తరాలు రాయటంకూడా జరిగింది. దానిమీద మా సంపాదకుడుగారు సంగతిసందర్భాలు విచారించి రమ్మని పంపటంవల్ల అక్కడికి చేరుకున్నాను.

తాలూకాఫీసులో భూములనంబర్లకోసం తాసీల్దారుతో మాట్లాడాలని ఆయన కోసం ఎదురుచూస్తున్నాను. నాతోపాటు చాలామంది జనంకూడా ఉన్నారు. ఆవలించేవాళ్ళూ, కునుకుపాట్లుపడేవాళ్ళూ— ఈవిధంగా జనమంతా ఉన్నారు. అందులో ఒకాయన యాదాలాపంగా ఎదురుగా ఉన్న స్తంభంమీద దరువు వేయటం ప్రారంభించాడు. నేను జాగర్తగా చూశాను ఆయన మృదంగప్రవీణుడేమోనని - కాని ఆ ధోరణి కనిపించలేదు.

ఆ దరువు మహాగోముగానూ, మృదువుగానూ, పట్టి పట్టి వేస్తున్నట్లూ కనిపించింది... చిటుక్కున ఎలక్ట్రిక్ షాక్ కొట్టినట్లు అసలుసంగతి తట్టింది

"ఏమండీ! మీరు ఒడ్రులా?" అని అడిగాను. ఆయన ఆశ్చర్యపడుతూ "మరేనండీ. మీ కెట్లా తెలిసింది?" అని అడిగాడు.

"మీకు కొంచం మసాజ్ విద్యలో ప్రవేశం ఉన్నట్లుందే?" అన్నాను.

ఆయన చిరునవ్వునవ్వుతూ "ఔనండీ. తమాషాగా కనిపెట్టేశారే!" అన్నాను.

ఇంతలో ఒక బంట్రోతు వచ్చి తాసీల్దారుగారు కమానునించి రావటానికి చాలా టైముపడుతుందని చెప్పటంవల్ల, నేను ఆయన్ని కాఫీకి రమ్మని పిలిచాను. మొదట సందేహించాడు కాని, తరవాత మెత్తపడ్డాడు.

*  *  *

"మొత్తానికి తమాషాగా కనిపెట్టేశారే బాబూ" అన్నాడాయన.

"తమాషా ఏముంది? మీరు ఇందాక యాదాలాపంగా ఒక చిన్న వరసను వేశారు. అది పట్టిచ్చింది." అన్నాను నేను.

"ఓహో! అదా సంగతి?"

"మీరు ఈ దేశానికి వొచ్చి ఎన్నాళ్ళయింది?"

"మా తాతగారి కాలంలోనే వచ్చాము."

"మీవాళ్ళు కొన్నేళ్ళపాటు ఇక్కడ ఉండి, తిరిగి వెళ్ళిపోతూ ఉండటం మామూలు కదా?"

"అది నిజమే. కాని మా తాతగారు ఇక్కడ ఒక నవాబుగారికి మాలీసు చేసేటప్పటికి ఆయన మహాసంతోషపడి ఒక మాన్యాన్నీ, షేర్ - ఇ - మాలీస్ అనే బిరుదునూ ఇచ్చారండి. అప్పటినుంచి ఇక్కడే స్థిరపడిపోయినాం. ఇప్పుడు ఈ ప్రాంతంలో మా వాళ్ళందరికీ నేను పెద్ద మేస్త్రీని. నాకింద చాలామంది ముఠాలు ఉన్నారు."

"తాసీల్దారుగారితో ఏదో పనిఉండి వచ్చారా?"

"ఆయన మాకు ఖాతాదారు. కమాను నించి తిరిగివస్తే, ఆరోజు ఒళ్ళు పట్టాల్సి ఉంటుంది. అందుకని కాస్త కనపడదామని వచ్చాను."

"ఒళ్ళు పట్టించుకుంటే లాభం ఏమిటి?"

"గుర్రానికి మాలీసు చేసినట్లే పాటుపడ్డ మనిషికి అది ఎంతో అవసరం."

"మరి కాలు కదిలించని షావుకార్లకు కూడా మాలీసు ఎందుకు?"

"కాలు కదిలించకపోవటంవల్లనే కావలసివస్తుంది. శరీరంలో ఏ భాగాన్నీ ఉపయోగించకుండా కూర్చునేటప్పటికి ఎక్కడి సరుకు అక్కడ నిలిచిపోతుంది. ఎక్కడికి పోవలసిన నెత్తురు అక్కడికి పోదు. అన్నిటివారా పొట్టలూ, మొత్తలూ పెరిగిపోతయ్."

"దానికితోడు తలకూడా తగ్గిపోతుందనుకుంటాను."

"ఆఁహ? అ దెక్కడ జరుగుతుంది. మరీ విడ్డూరం."

"తగ్గుతుందంటే సన్నపడిపోతుందనా? రబ్బర్ బెలూన్ మోస్తరు పొట్ట పెరిగితే, తల మరీ సన్నగా కనిపించదూ?"

"హహ్హహ్హా! ఆ మాట నిజమే. ఈ షావుకార్లు ఘరానామనుష్యులు చూడండి అంతా డైమన్ మార్కు మోస్తరు ఉంటారు. నడుందగ్గర అరమైలువరకూ ఉన్న చుట్టుకొలత, తలకాయదగ్గర పదంగుళాలూ, కాళ్ళదగ్గర పన్నెండంగుళాలూ అవుతుంది." అంటూ ఆయన విరగబడి నవ్వాడు.

"అయితే మీరు చేస్తున్నది ఆ డైమన్ మార్కుని ఆర్డిన్ ముద్దగా చేద్దామనా, లేకపోతే కళావరుగా సర్దుదామనా?"

ఆయన ఉప్పెనగా నవ్వాడు.

"అది సర్దటం మాతరం అవుతుందా? కొవ్వు పేరుకుంటే, పేరుకున్నది కనీసం నెత్తురయినా గడ్డకట్టకుండా చూద్దామనే మా తంటాలు."

"కసరత్ చేస్తే సరిపోదూ?"

"వాళ్ళు చేసేబదులు మా చేత చేయిస్తున్నారు."

"దానివల్ల ఫలితం ఏమన్నా ఉన్నదా?"

"చేతులు - అంటే మా చేతులు - ఆడినంతకాలమూ వ్యవహారం పూర్తిగా చెడకుండా ఉంటుంది."

"నువ్వే లడ్డు నమిలి పెట్టూ, నువ్వే లడ్డుమింగి పెట్టూ అన్నట్లు, నువ్వే కసరత్ చేసి పెట్టూ అంటారన్నమాట."

"ఉన్నమాట చెప్పారు. మన్లో మాట. నువ్వే లడ్డు నమిలిపెట్టూ అని కూడా అంటారా ఏమిటి?"

"సరిసరి! మీ కింకా తెలియదా ఏమిటి? పళ్ళన్నీ పుచ్చిపోయి తిండితినలేక, నువ్వే లడ్డు నమిలిపెట్టూ అని అడిగినందువల్ల కంపెనీలవాళ్ళు సగం ఉడికిన ఆహారాలనీ, పన్న బిస్కట్లనూ, టాఫీలనూ

సప్లయిచేస్తున్నారు. అదికూడా జీర్ణంకానందువల్ల నువ్వే లడ్డు మింగిపెట్టూ అని అడిగితే, డాక్టర్లు కడుపులో సగం జీర్ణమయినట్లుగా ఆహారాన్ని తయారుచేసి ఇస్తున్నారు. ఆ ఆహారాన్ని పెప్టనైజ్డ్ ఫుడ్ అంటారు "

షేర్-ఇ-మాలీస్ నవ్వు ఆపుకోలేక ఆపుకుంటూ "ఇంకా..." అంటూ నసిగాడు.

"ఆహా! అదికూడా జరుగుతున్నది. అందుకనే విరేచనలేహ్యాలూ, ఎనిమా డబ్బాలూ ఎక్కువగా తయారవుతున్నయ్." అన్నాను.

"మహామజాగా చెప్పారండీ. మా ఖాతాదార్లంతా ఈరకంమనుషులేగా! చూస్తే ఒక్కళ్లుకూడా మనుషులల్లే ఉండరు. రాక్షసులమోస్తరు పొట్టలూ, వాళ్లూ. దీనికి ఎదురు రకం మనుషులు కూడా ఉన్నారు. విల్లంబుబద్దల్లాగా వంగిపోయి, మెడ వొంగిపోయి, ఈడుస్తూ, ఏడుస్తూ, నడుస్తారు."

"వాళ్ళకి మీ చికిత్స పని చేయదా ఏమిటి ?"

"ఎందుకు పనిచేయదండీ ? కాని, వాళ్ళకి మమ్మల్ని భరించే సత్తా ఏదీ? పొద్దున 8 గంటలనుంచి రాత్రి 9 గంటల వరకూ వంచిన తల ఎత్తకుండా చాకిరిచేసే గుమస్తాలూ, ఒక్కపూట తింటే, రెండుపూటలు పస్తుండే బక్క జీతగాళ్ళూ ఏం భరాయిస్తారు ? అసలు ఇంకో సంగతి చూశారూ ! కడుపులో సరుకు లేకపోతే మాలీసువల్ల లాభం ఎక్కడిదీ ? పైపెచ్చు ఎండుపుల్లలు విరిగినట్లు విరిగిపోతారు."

"అంతే నంటారా ?"

"అంతే కాదు. సరయిన తిండి పడకపోతే మనుషులు పెరగనుకూడా పెరగరు. ఇదివరకు మా దేశంవాళ్లంతా, తెలుగువాళ్ళంటే ఆజానుబాహులనీ, వీరులు, విక్రమార్కులనీ అనుకునేవాళ్లు. ఇప్పుడు ఏముంది ? నెయ్యి, పాలు, కూరగాయల వ్యాపారాలు మోపయినతరవాత, ఎక్కడ చూసినా ఏడుపు మొహాలే."

"స్వీడిష్‌మసాజ్ అంటారు, మీకేమన్నా తెలుసా ?"

"ఆ అదీ విచారించాను. దానికీ మన మాలీసుకీ ఆట్టే తేడాలేదు. దేశవాళీమాలీసులో ఒళ్లుపట్టించుకునేవాడు కేవలం మట్టిబొమ్మమోస్తరుగా కూర్చుంటాడు. వాళ్లపద్ధతిలో అయితే మాలీసుకదలికకు ఎదురుపద్ధతిల్లో కండల్ని కదిలిస్తాడు. దీనివల్ల ఇంకొంచం కదలిక వుంటుందని వాళ్ళ నమ్మకం."

"మీ వృత్తికి ఏమయినా భవిష్యత్తు ఉన్నదా ?"

"కావలసినంత ఉన్నది. జబ్బుపడ్డవాళ్ళకు మేము ఎంతయినా సాయపడగలం. కసరత్తుచేయని మనుషులూ, తగిన ఆరోగ్యపద్ధతులు లేని దేశం, ఉన్నంతకాలం మాపని బాగానే ఉంటుంది."

"ఆరోగ్యపద్ధతులంటే ఏమిటి ?"

"మనిషిశరీరమన్నది సరిగా పనిచేస్తూ ఉండాలంటే దానికి కొంత సక్రమమయిన పని ఉండాలి. లేకపోతే తుప్పుపట్టిన ఇంజన్‌మోస్తరుగా తయారవుతుంది. జనానికి మాటల్లో చూపించే సరదా, పనిచేయటంలో కనిపించదు కదా."

"ఈరోజుల్లో మోటబలం అనవసరమండీ"

"మోటబల మేమిటీ ? కులాసాగా బతకటానికీ, రోగం రొష్టూ లేకుండా సుఖంగా కాలం వెళ్ళదీయటానికీ బలం అనేది కావలసిందే. దానికి కొంచం శరీరాన్ని కదిలించక తప్పదు."

"అన్నిపనుల్లోనూ అది సాధ్యపడదుగా ?"

"ప్రభుత్వం లక్షలు ఖర్చుపెట్టి స్టేడియంలు కట్టించేబదులు ప్రతివీధికీ ఒక ఆటస్థలాన్నీ ఒక తాలింఖానాను ఏర్పాటుచేస్తే సరి. దానికితోడు మంచి తిండికూడా-"

"ముందు అసలు కడుపు నిండనివ్వండి- సరే మీకు రాజకీయంగా ఏమయినా ప్రాధాన్యత ఉన్నదా ?"

"ఒకవిధంగా ఉన్నదనే చెప్పాలి. అధికారులకి ఎదురునిలిచేవాళ్ళందరికీ మేము ప్రాణస్నేహితులం."

"అంటే మీరు అరాజకవాదులా ఏమిటి ?"

"అబ్బే! అదేం కాదు. అధికారులకిఎదురు నిలిచేవాళ్లు అంటే చాలు, వాళ్లమీద పోలీసులు తమ నైపుణ్యంఅంతా ప్రదర్శిస్తారు. అప్పుడు మళ్లీ వాళ్ల శరీరాలు స్వాధీనంలోకి రావాలంటే కొన్నాళ్లపాటు మా సహాయం అవసరం."

"ఓహో ! అందుకా !"

"అవును. బ్రిటిష్ హయాంలో కాంగ్రెసువాళ్లమీద చిత్రవధానైపుణ్యం ప్రదర్శించిన పోలీసువాళ్లు ఇప్పుడు కమ్యూనిస్టులమీద దానిని చూపిస్తున్నారు. వీళ్ల తస్సాదియ్యా ! మనిషిని ఎన్నివిధాల నలగ పొడవటం వీలున్నదో, అన్ని విధాలూ వీళ్లకు తెలుసు."

"అందులో రకాలుకూడా ఉన్నయ్యా?"

"ఆహా! అందుకనే మనిషిని చూడగానే. మేము ఆయనమీద ఏ అధికారి చెయ్యిపడ్డదీ పసికట్టేస్తాం. ఒక సబిన్స్‌పెక్టర్‌గారు నాడాలు వేసిన బూటుకాళ్లని ఉపయోగించటంలో అఖండుడు. ఒక హెడ్‌కానిస్టేబుల్‌గారు లాటీప్రయోగంలో నిధి. ఒక సూపర్నెంటుగారు బాక్సింగ్ మాస్టర్. ఒక స్పెషల్ పోలీసుగారు రైఫుల్ తిరగేసి కుమ్మటంలో అద్వితీయుడు. ఒక సర్కిల్‌గారు హంటర్‌ని చేతపుచ్చుకుంటే, వాడియావారి నాడియాని మించిపోతాడు. ఒక సార్జంటుగారు వీటన్నిటితోపాటుగా ఉడుకునీళ్లు-కొరివికారం ప్రయోగనిపుణుడు."

"ఇంక చాలు బాబూ, వినలేను...కళలతో మీకు సంబంధం ఉన్నదా?"

"మాలీస్‌చేస్తే అందం పెరుగుతుంది. అందుకనే మర్దనం గుణవర్ధనం అన్నారు. అదికూడా మొగవాళ్లు ఆడవాళ్లకీ, ఆడవాళ్లు మొగవాళ్లకీ చేస్తే ఎక్కువ ఫలం ఇస్తుందట."

"ఎవరండోయ్ అది చెప్పింది."

"భగవాన్ వాగ్భటాచార్యులవారు అష్టాంగహృదయంలో చెప్పాడు."

"మీ నెక్స్ట్ ప్రోగ్రాం ఏమిటి ?"

"మావాళ్లందరినీ ఒక సంఘంగా ఏర్పాటుచేసి ప్రెసిడెంటు నవుతాను."

"అదెట్లా సాధ్యపడుతుంది ? మీకే మేస్త్రీనన్నారే ?"

"సంభ్రమంగా వీలవుతుంది. ఈరోజుల్లో పనివాళ్ళకి ప్రతినిధులు మేస్త్రీలే. కంట్రాక్టర్లే. గుమాస్తాల సంఘానికి అధ్యక్షుడు ఆఫీసు మేనేజరే. వ్యవసాయకూలిలకు నాయకుడు బడా ఆసామే ?"

"ప్రెసిడెంట్ అయి ?"

"మంత్రిని అవుతాను. దానికి క్వాలిఫికేషన్లు అక్కర్లేదుకనుక ఫరవాలేదు. ఇంక సంఘంవాళ్లా, వాళ్లల్లో ఒక్కళ్ళు మంత్రి అయితే, అంతా తమ కేదో ఒరుగుతున్నదని భ్రమపడతారు. నామాట విని మీరుకూడా మీరుపనిచేసేచోట ఒకసంఘం అంటూపెట్టి, ప్రొప్రయిటర్‌తో బేరాలు జరపండి. జీతంబాగా పెరుగుతుంది...ఇంక శెలవిప్పిస్తారా" అంటూ లేచి రెండుసార్లు జబ్బలుచరుచుకున్నాడు షేర్-ఇ-మాలీస్

———